## శ్రీమతి ఆర్. వసుంధరాదేవి

# గడియారం

సాయంత్రం హాస్పిటల్ డ్యూటీ అయ్యాక యింటికి చేరుకునే సరికి మనోమోహినికి శరీరమూ మనసూ కూడా అలసటతో వాలిపోతున్నవి. వేడిగా ఒక కప్పు కాఫీ త్రాగి వచ్చి లాన్‌లో కూర్చున్నది. ఇంటికి అవతల ప్రక్కన పిల్లలు ఆడుకుంటున్న గోల వినిపిస్తున్నది. ప్రక్కింటి వేపాగారి పిల్లలు కూడా వచ్చి నట్లున్నది. వాళ్లకి తెలుగు బాగా తెలుసు.

'మనం...మనం ... బరం .... పురం' అంటూ సరదాగా అరుస్తున్నారు.

మనసులోని ఏ లోతుల్లోనో ఒక స్మృతి – తియ్యని తెనుగు స్మృతి కదిలింది.

కాని కేకలుపెడుతూ అరుస్తున్న ఆ పిల్లల్లో ఏ స్మృతీ కదలదు !

'మనం' 'మనం' 'బరం' 'పురం'

అర్థంలేని మాటల కూర్పు.

అర్థంతో పనిలేకుండా ఒకళ్ళొకరు చూసుకుంటూ విరగబడి నవ్వుకునే పిల్లల్లాగా, ఏమి ఆట ? ఎంత బుద్ధిలేని నవ్వు ! అనుకుని నవ్వుకుంది. పిల్లల కేకలు, ఉత్సాహం మనసులోకి ఇంకుతున్నకొద్దీ అలసటపోయి మనసు తేట పడింది. ప్రశాంతత వచ్చింది.

ఎదురుగా తీగెలో పూర్తిగా వికసించి చల్లని గాలిలో మెల్లగా వూగుతున్న పువ్వు.

ఒక పరిస్థితి నుంచీ ఒక తరం పుడుతుంది. ఒకే తరానికి చెందినా అందులోని ప్రతిమనిషీ ఒక వ్యక్తి. వారి జీవితంలోని వికాసం వారు సాధించుకోవలసిన ప్రత్యేకత. వారి జీవిత లక్ష్యం.

ప్రపంచం ఒక నందన వనం. అందులో ఎన్నోరకాల చెట్లు. ఎన్నో రకాల పూలు.

అన్నీ ఒక మట్టిలోంచే పుట్టివుండవచ్చు. కాలం తీరి నప్పుడు, వాడిపోయి నేలకు రాలిపోయినప్పుడు అదే మట్టిలో కలిసి పోవచ్చు. కాని అది సాధించుకున్న 'పువ్వుదనం', దాని వ్యక్తిత్వం మట్టిలో కలవదు! ఆ మట్టి ఎలా అనాదో, యీ జీవితం కూడా అలా అనాది !

ఇంతవరకూ అనుకోగానే మనోమోహినికి ధర్మ అక్కయ్య జ్ఞాపకం వచ్చింది. చిత్రంగా ధర్మకూడా యిలాగే అంటుంది. కాని జీవితం అంటే ఆవిడకి హృదయ సంబంధి. అందులో అనుభూతి వుండొచ్చుగాని ప్రగతి లేదు. మనోమోహినికి జీవితం మనోసంబంధి. మేధా సంబంధి. 'నేను ఆలోచించగలను. కనుక నేను ఉన్నాను' అన్న డెకార్టె ఆమె ప్రపంచానికి ఆద్యుడు. అతనితో ప్రగతి ప్రారంభమైంది. న్యూటన్, డార్విన్,మార్క్స్ మొదలుగా శాస్త్రజ్ఞులు ప్రపంచ స్వరూపాన్ని, దాన్ని నియమిస్తున్న సూత్రాల్ని కనిపెట్టటం ప్రారంభించాక మనిషీ, ప్రపంచమూ కూడా మారి పోయారు. ఈ రహస్య చ్ఛేదనతో మనిషికి లభించిన మహత్తర శక్తికి చిహ్నం యిప్పటి సాంకేతిక ప్రగతి. ఇది హేతుయుగం, శాస్త్రయుగం. ఇప్పుడు మనిషి తనను గురించి తాను తెలుసు కోవాలంటే తగిన శాస్త్రగ్రంథం వెతుక్కుని చదువుకుంటే తెలిసి పోతుంది. తోచటం, అన్పించటం, హృదయం చెప్పటం – ఇది చీకటిని ఆరాధించే అశాస్త్రీయ, అవాంఛనీయ, తిరోగమనశీల పద్ధతి. నిజమే, ఒకప్పుడు హృదయం రాజ్యం చేసింది – అనేక యుగాల మానవ అనుభూతికి ప్రతినిధినంటూ, జీవితంలోని మహత్తర సత్యానికి, సౌందర్య రహస్యానికి మార్గాన్నంటూ. కాని ఆ సత్యమేదో ప్రకృతిలో నియమ రూపంగా వుంది. అంతే. వెనుక బడ్డ ప్రాచ్యదేశాలూ, ధర్మలాంటివాళ్ళూ యింత విస్తృతమైన సత్యం కోసం ఒక చిన్న గుండెలోని చీకట్లో వెతుక్కోబోతారు ! ఇన్ని యుగాల మానవ యత్నానికి ఫలితం యీ మేధస్సు – యీ విజ్ఞానం.

ఎదురుగా టీపాయ్‌మీద తనకారోజు పోస్టులో వచ్చిన ఉత్తరం తెచ్చిపెట్టారు పిల్లలు. అది ఇండియా నుంచి, ధర్మ దగ్గర నుంచీ వచ్చింది. ఏమి వ్రాసిందో చదవాలన్న ఆతృత, ఉత్సాహం లేవు మనోకి–తమ యిద్దరి మధ్య సంబంధం ఏనాడో తప్పిపోయింది.

అమెరికా వచ్చిన మొదట్లో మనో ఒక చోటి నుండి పీకి మరోచోట నాటిన మొక్కలా బాధపడింది. తన మూలం ఎక్కడో ఇండియాలో వున్నట్లు భావన.ఎప్పుడో ఒకనాడు తిరిగి ఇండియాకు వెళ్లి, అక్కడ తనవారి మధ్యన గొప్పగా మంచి హోదాలో వుంటా నన్న ఊహలో ఊరట పొందేది. తరచుగా అక్కకీ, అమ్మకీ ఉత్తరాలు వ్రాసేది. రెండేళ్లకోమాటు వెళ్లి చూచి వచ్చేది. కాని క్రమంగా ఆ బాధ చల్లారిపోయింది. పిల్లలు యిక్కడే పెరిగి పెద్దవాళ్లవుతున్నారు. వాళ్లకి తెలుగు భాషతో కొంత పరిచయం వుంది. కాని తెనుగు దేశంతో లేదు. అమ్మ చనిపోయింది. ఇండియాకు వెళ్లి అయిదేళ్లయిపోయింది. ఇప్పుడు వెళ్లాలంటే

నీరసం 'ఎప్పుడో వెళ్దాంలే, ఒకసారి' అనిపిస్తుంది. ప్రయాణం బరువుగా తోస్తుంది.

ఎన్నడో ఒకసారి బాల్యస్మృతులు అప్రయత్నంగా, స్మృతుల కుండే తియ్యదనంతో వెలికివస్తాయి. కాని ఆమె మనసు వాటిని విసుగ్గా తిరస్కరిస్తుంది.

అక్కడ కాలంలో కదలిక లేదు. మానవ ప్రయత్నానికి విలువలేదు. అది మనిషి శక్తిని కబళించివేస్తుంది. ధర్మ ఫిజిక్స్ బి. ఏ. చదువుకుంది. అది చదువుకాదు – పెళ్లయ్యేదాకా కాలం గడపటం. మామయ్యని పెళ్ళిచేసుకుని, పల్లెటూళ్లో యింట్లో కూర్చుని, అమ్మమ్మ గడిపిన జీవితాన్ని పూజలు నోముల దగ్గర్నుంచీ తూచా తప్పించకుండా గడిపేస్తోంది! తాను కాలగర్భంలో, ప్రగతితో పనిలేని నిశ్చలతత్వంలో వున్నాననుకుంటూ నిశ్చింతగా కాలం గడిపేస్తోంది.

ఇండియాలో వుండేదల్లా అసమర్థత, పేదరికం, మురికి, వంచన. ఎన్ని తరాలు గడిచినా ఆ జీవితం అలానే సాగుతూ వుంటుంది–ముఖ్యంగా గ్రామాల్లో. అక్కడ మార్పు అనేది కాన రాకుండా బహునెమ్మదిగా, బహుదొంగగా ప్రవేశించాల్సిందే. అక్కడి 'బుడ్డాడు' 'ఎంకిగాడు' కావచ్చు. క్రమంగా 'ఎంకడు' కావచ్చు. పేరు ఏదైనా వాడు ఉదయమే పాలు పిండాక గొడ్ల చావడి వూడ్చి చద్దన్నంతిని బలిసిన బర్రెమీద తాపీగా సవారీచేస్తూ గొడ్లుతోలుకు పోతాడు. తాటికాయల కాలంలో గొడ్లని ఎక్కడో ఒదిలేసి దొరికి నన్ని తాటిగెలలు కొట్టుకుని ముంజెలుతిని కడుపునొప్పని మూలుగుతూవచ్చి పనికి నాగాపెడతాడు. గృహిణులు బియ్యం, పప్పుల్లో వర్తకులు కలిపిన రాళ్లను చెత్తను ఏరుకుంటూ గంటలు గడుపుతారు. ఎండిన తాటాకుల్ని, తాటిమట్టల్ని సద్వినియోగం చెయ్యటానికి వెనకదొడ్లో ఆరుబయట పొయ్యిపెట్టుకుని స్నానాలకు వేడినీళ్లు, వంటలు అన్నీ ఆ మంటమీదే కానిస్తారు. వానజల్లులు దిగుతాయేమోనని ఆదుర్దాగా ఆకాశం దిక్కుకు చూసుకుంటూ వుంటారు. ఇంటికప్పులమీద కూర్చున్న 'ఇనపముక్కు' కాకులు పొయ్యిమీద గిన్నెలో కుతకుత ఉడుకుతున్న అన్నాన్ని ఎవరూ లేనప్పుడు నోటినిండా చిక్కించుకుని, మింగిపారేస్తుంటే 'హూత్, హూత్' అంటూ సైరన్లలా అరుస్తుంటారు. దొడ్లో ఒక మూలన ఎడ్లకోసం ప్రొద్దుట్నుండీ సాయంత్రంవరకూ ఉలవలు తంపట్లో తాపీగా వుడుకుతూ వుంటాయి. నేలబావిలోంచీ జీతగాడు వందకడవల నీళ్లు తోడి తొట్లు నింపుతాడు. తెల్లవారకముందే రైతుల యిళ్లల్లోంచీ అరగంటసేపు కవ్వంతో మజ్జిగ చిలుకుతున్న శబ్దం వినవస్తుంది–ఇది అక్కడి ఇరవయ్యో శతాబ్దం. ఇంతకు ముందు లేనిది, యీ పదేళ్లలో వచ్చిన గొప్పమార్పు – వారానికో రోజు ఒక కాంపౌండరు మందులు తీసుకొచ్చి కోరినవాళ్లకు ఇంజె క్షన్లు యిచ్చి పోతూవుండటం. ఇంకో పాతికేళ్లకి ఆ వూళ్ళోకి ఒక నిజం డాక్టరు రావచ్చు. మరో యాభై ఏళ్లకి ఒక సినిమా హాలు రావచ్చు. కాని ఇప్పుడప్పుడే కాదు ... నెమ్మదిమీద... భవిష్యత్తులో ఎప్పుడో ఒకనాడు...

ఈ చచ్చుదనం మనోకి ఊపిరాడనివ్వదు. 'నేను' ఏమిటో చెయ్యాలి, చేస్తాను! చదువుకుంది. డాక్టరైంది. అమెరికా వెళ్లింది. డబ్బు, వస్తువులు, సుఖం సంపాదించింది.

మనోకి చిన్నమ్మమ్మ కొడుకు రాము మామయ్య. వాళ్లు పట్నంలో వుండేవాళ్లు. ధర్మ, మనో చిన్నప్పుడు తరచు వారింటికి వెళ్లేవారు. రాము మామయ్యంత వ్యర్థజీవి మరెవరూ వుండరు. ప్రయత్నం అనేది అతని డిక్షనరీలోలేదు. జీవితాన్ని మహా తేలిగ్గా తీసుకుని బ్రతికాడు. చిన్నప్పుడు బడికి పంపిస్తే రోజూ బడి కెళ్లాడు గాని చదువుకోలేదు. పెద్దయ్యాక ఇంట్లో ఎవరే పని చెప్పినా తాపీగా చేసుకుంటూ పోయేవాడు. చిన్నపిల్లల్తో ఆడు కుంటూ వాళ్లకి కాగితాల రాకెట్లు, పడవలు, లాగులు, గిర్రున తిరిగే చక్రాలు, గాలిపటాలు చేసిపెట్టేవాడు. అతని భార్య ఏడ్చు కుంటూ, పోట్లాడుతూ యింట్లో వంటపనీ, పైపనీ చేసేది. మనోకి యీ పిచ్చి మామయ్యని చూసినా, నిత్యం అతని మొహంలో కనిపించే నవ్వు చూసినా ఎగతాళి, చిరాకు, కోపం వచ్చేవి. చిన్న మ్మమ్మ దుడ్డుకర్ర తీసుకుని మామయ్య నెత్తిమీద ఒక్కటెయ్యా లనిపించేది. ఒక్కోసారి వెనకనుంచీ తోసేది, కొట్టేది కూడా. ఆ మామయ్య జీవితంలో చెప్పుకోదగ్గ ఘనకార్యం ఒక్కటేచేశాడు. ఒకనాడు పిల్లలందరినీ చుట్టూ కూర్చోపెట్టుకుని 'పిల్లలూ, నేను ఒచ్చే దశమినాడు మధ్యాహ్నం ఒంటిగంటకు దేవుడిదగ్గరకు పోతాను' అన్నాడు. పిల్లలకి ఉత్సాహం వచ్చింది. 'నిజం?' అన్నారు. 'నిజం' అన్నాడు మామయ్య గంభీరంగా. ఇంకొంచెంసేపు రెట్టించి పిల్లలు ఆ మాట పూర్తిగా మరచిపోయారు. వారం రోజుల తర్వాత ఆ రోజు దశమి – మధ్యాహ్నం ఒంటిగంటకు అలాగే గోడ కానుకుని కూర్చుని పిల్లల ఆటలు చూస్తూ కళ్లుమూసు కుని ప్రక్క కొరిగిపోయాడు. దాన్తో పిచ్చి మామయ్య వ్యర్థ జీవితం ఆఖరైపోయింది. ఆ మామయ్యని తల్చుకుంటే యిప్పటికీ జాలి, విసుగు,–కోపం కలుగుతాయి మనోకి.

ధర్మలో మహా చీకాకు కల్గించే మరోగుణం – భూమిమీద నివసిస్తూ ఎప్పుడూ ఆకాశాన్ని చూస్తూవుండటం. అతీంద్రియత గురించీ, అద్వైతం గురించీ మాట్లాడుతూ వస్తువుల కోసం వెంపర్లాడటం. కేవలం తుచ్ఛమైన డబ్బుకోసం, కోరికల కోసం పరదేశానికి అమ్ముడుపోయినట్లు తనని చిన్న చూపుచూసిన ధర్మకి ఆ పరదేశపు వస్తువులమీద ఎంత వ్యామోహం! ఇక్కడి బట్టలు, మిక్సర్, టేప్‌రికార్డర్, పెన్నులు, పిన్నులు, హోల్డాలు, డిన్నర్ సెట్టు – అన్నీ కావాలి!

వాళ్ల జీవితానికీ, మాట్లాడే మాటలకీ ఎక్కడా పొంతన వుండదు. ఆ వేదాంతం వాళ్ల జీవితంలోని అప్రయోజకత్వానికి భాష్యం చెప్పుకునే ప్రయత్నంగా కూడా వుంటుంది. అసలు ఈ వేదాంతం గురించి చాకలి సుబ్బడికి తెలిసినంత మరెవరికీ తెలియదు! అని నవ్వుకుంటుంది మనో. ఎవరైనా ఏదైనా విషయాన్ని వూరికే సాగలాగినా, విసుగు పుట్టించేట్లు నసుగుతున్నా 'ఆమెదంతా అదోక అద్వైతం' అని విసుక్కుంటాడు సుబ్బడు.

ధర్మ ఉత్తరం చదవకుండానే అందులో ఏముందో మనోకి తెలుసు. ఒకటీ, అరా కోరికలూ చాల అద్వైతమూ వుంటాయి. అటువంటి అద్వైతం మనోకి గిట్టదు.

ఒకసారి ధర్మ గ్రైండర్ కావాలని అడిగింది. అది కొంటూంటే భర్త వినోద్ అడిగాడు: 'ఇండియాలో ఏ. సీ. కరెంటు కదా. డీ. సీ. గ్రైండర్ కొంటున్నావేం ?' అని. 'ఇప్పుడు దానికోసం ఎక్కడ వెదుకుదాం ? టైంలేదు. కావాలంటే ట్రాన్స్ ఫార్మర్ కొనుక్కుంటుంది' అని కొనేసింది. దానికి ట్రాన్స్‌ఫార్మర్ ధర్మకి ఒక పట్టాన దొరకలేదు. ఆఖరికి ఒక పంజాబీవాడు వంద రూపాయిలకి ఒకటిచ్చాడు. ఇంటికెళ్లి దాన్ని వుపయోగించగానే గ్రైండర్ మోటార్ కాలిపోయింది. అప్పణ్ణుంచీ ధర్మ అద్దాల అల్మారాలో ఒక గ్రైండరూ, ఒక ట్రాన్స్‌ఫార్మరూ అలంకారాలుగా నిలిచాయి. వాటిని చూసినప్పుడల్లా నవ్వుతుంది మనో. 'నీవు చేసిన ఘనకార్యమే' అంటుంది ధర్మనిష్ఠూరంగా. మనో మరింతగా నవ్వుతుంది.

తమ కిద్దరికీ సంబంధం ఎక్కడుంది?

టీపాయ్‌మీదున్న ఉత్తరం అందుకుని తాపీగా చదవటం ప్రారంభించింది.

"మనో,

ఈ మధ్యన కొంతకాలంగా నాకు ఒంట్లో బాగుండటం లేదు. చాల బలహీనమైపోయాను. మొన్ననే హైదరాబాద్‌లో డాక్టర్లు లుకేమియా అని తేల్చారు. అందుకని నేమ దుఃఖపడి పోవటంలేదు...కాని...ఎంత అకస్మాత్తుగా వచ్చింది!...శరీరధారులు ఎప్పుడో ఒకనాడు శరీరం వదిలిపెట్టాల్సిందేననుకో...అయినా... ఏమిటోగా వుంది.

వింత ఏమంటే యిప్పుడు నాకు మామయ్యని గురించి గాని పిల్లల్ని గురించి గాని చెల్లెళ్ళని గురించి గాని ఆలోచనలేదు.

ఇక్కడ యీసారి ఎండాకాలం ఎంత మాడ్చేసిందనుకున్నావ్! ఈ వేడీ తాపమూ ఒకరోజున అంతమైపోతాయన్న ఆశపోయింది. ఈ మంటల్లో భూమి నిలవదనిపించింది. ఇంత నరకంలోనే నాల్గు రోజుల క్రిందట బంగాళాఖాతంలో వాయుగుండం పుట్టింది. ఇవాళ అంతటా చల్లదనం, ప్రశాంతత, తడిసిన నేల, వానలో నానిన పెంకుటిళ్లు, వర్షధారల్లోంచీ జీవశక్తిని పుంజుకుని నిగారింపు తెచ్చుకున్న కొబ్బరాకులు, తనిసిన ప్రకృతి ఏదో హాయిలోకి ఒరిగిపోతున్నట్లు స్తబ్దత, ఇదంతా ఒదిలిపోవాలని దిగులు. పిచ్చి అనిపిస్తోందా?

మరో విషయమేమంటే నాన్నగారిది పాతది బంగారుపూత పూసిన వెస్టెండ్ జేబు గడియారం నా దగ్గర వున్నది. ఇప్పుడా బంగారుపూత పోయింది. కాని నాన్నగారి దగ్గరున్నప్పట్లాగే బాగా తిరుగుతున్నది. దాన్ని నీకు పంపిస్తున్నాను. కావాలంటే డయల్‌తీసి బంగారుపూత వేయించుకో.

సరే, యిహ వుంటానేం. నాకు మనసు ఒకరకంగా వుండటం లేదు ఏమిటో యిక్కడ నేను చెయ్యాల్సిన పనులు మిగిలిపోతున్నట్లు ఏమిటో మరచిపోతున్నట్లు కొంచెం గాబరాగా వుంది. ఉంటా మరి. నీవు బాగున్నావా?

ఆశీస్సులతో
ధర్మ"

ఉత్తరం మడిచి టీపాయ్‌మీద పెట్టేసి కళ్లు మూసుకుంది మనో. కళ్లల్లోంచీ నిశ్శబ్దంగా నీళ్లు ధార కట్టాయి.

ధర్మకి వయస్సు నలభై దాటింది, అంతే. ఇలాంటి జబ్బులు అక్కడ త్వరగా కనుక్కోరు. ఆంపిసెల్లిన్‌లూ, క్లోరోమైసిటిన్‌లూ అయ్యాక తీరిగ్గా కనుక్కుంటారు...ఇహ నెలో...రెణ్ణెల్లో...

ఈ హఠాత్సంఘటనతో ఆమె మనసు మూగపోయింది. ఏవో అంతర్లోకాల్లోకి విరుచుకుపడిపోయింది. తన జీవితం తనది కానట్లు తన చదువు, వుద్యోగం, దేశాంతరవాసం సంసారం అంతా మిథ్య అయినట్లు అనిపించింది. అక్కడి మారనిలోకం, కదలనికాలం, పంటచేలు, తాటిచెట్లు, పెంకుటిళ్లు, తన వాళ్లందరూ కాలి మసైపోయిన స్మశానం అన్నీ కళ్లముందు మెదిలాయి. జీవితంలోని సత్యం యింతేనా? యింతేనా? అంటూ మనసు మూలిగింది.

తెల్లని గుండ్రని ముఖంమీద తీరైన నల్లని అంకెలు. చుట్టూ మెరిసే బంగారురంగు. చాల శుభ్రంగా, చాల అందంగా, చాల హుందాగా నాన్నగారిలా కన్పించేది ఆ వాచీ. నాన్నగారు పోయినప్పుడు జ్ఞాపకచిహ్నంగా దాన్ని తీసుకుందామనుకుంది మనో. ధర్మ తీసేసుకుంటుందేమోనని అనుమానం. నేరుగావెళ్లి బీరువా తెరిచి వాచీ మామూలుగా వుండేచోట చూసింది. అది అక్కడలేదు. ధర్మ ముందే తీసేసుకుంది!... ఆ క్షణంలో ధర్మమీద ఎంత అసహ్యం, పగ పుట్టాయో! అప్పటినుండి యిప్పటివరకూ అక్క అన్న ఆప్యాయత కలగలేదు...ఇప్పుడా వాచ్‌ని యిచ్చేస్తానంటోంది ధర్మ !

ఎప్పటి వాచ్ !

అది నాన్నగారున్నప్పటిలాగే వున్నట్లు, అలాగే తిరుగుతున్నట్లు ధర్మకి కనిపిస్తోంది.

కాని అది ఎంత కాలాన్ని మింగేసింది !

ధర్మ యిహ తనకు కనబడదు.

అంత సన్నిహితులమధ్య చివరి వీడ్కోలు యింత నిశ్శబ్దంగా వుంటుందని నమ్మకం కలగటంలేదు మనోకి.

ఎదురుగా వున్న తీగెలో పూర్తిగా వికసించి వంగి వేళ్లాడుతున్న పువ్వు చూస్తుండగానే మరింత వాలి తీగనుంచీ విడివడి గాలిలో తేలుకుంటూ క్రమంగా క్రిందికి దిగి మట్టిని తాకి స్వస్థత పొందింది. ఆ పువ్వు పరిణతి, దాని లక్ష్యం, దాని సత్యం ఆ మట్టిలోనే ముడిపడి వున్నాయా? జీవితానికి సార్థకత జీవించడమేనా? ఏమీ సాధించాల్సిన అవసరంలేదా? అనంతమూ, సంకీర్ణమూ, అభేద్యమూ అయిన జీవితంముందు మానవ ప్రయత్నం అల్పమేనా?

వినోద్ కారు లోపలికి వచ్చింది.

ఛీ, ఛీ. ఏమిటీ బేలతనం? అనుకుని కళ్లు తుడుచుకుంది మనో.

వినోద్ వచ్చి ప్రక్కన కూర్చున్నాడు.

"ఏమిటలా వున్నావ్, మనో?" అన్నాడు.

లెటర్ తీసి అతని కిచ్చింది.

అంతా చదివి నిండైన సానుభూతితో అన్నాడు: 'మనం ఏమైనా సహాయం చెయ్యగలమా, మనో?'

అతనివేపు కృతజ్ఞతతో చూసి తల అడ్డంగా ఆడించింది. అవును...చెయ్యటం...ఇప్పుడు తాము చెయ్యగల్గిందేమీలేదు!

'వాచ్ ఏమిటి?' అడిగాడు వినోద్.

'ఆ, పాతవాచ్, ఒక పాత పాకెట్ వాచ్' అన్నది మనో. ఆ వాచ్ చుట్టూ అల్లబడ్డ అనవసరపు భావబంధాలూ, ఘర్షణలూ అకస్మాత్తుగా ఛేదించుకుపోయాయి.

ఆమె మనసులో అప్పుడే ధర్మ చచ్చిపోయింది. స్మశాన వైరాగ్యం కూడా అనుభవించేసింది. అంతా ఒక స్మృతిగా, అందరాని చోట నిలిచిన చిన్న బరువుగా ఆఖరైపోయింది.

తన రాగద్వేషాల్ని తిరిగ్గా నెమరువేసుకుంటూ తనకి తానే కితకితలు పెట్టుకునే సోమరిబుద్ధి లేదు మనోకి.

సైకియాట్రీ పుస్తకాల్లో ఆరోగ్యవంతమైన మనస్సు గొప్ప దుఃఖంనుంచీ ఎంత సమయంలోపుగా కోలుకోవాలో వ్రాసి వుంటుంది.

దుఃఖపడి ఏమి సాధించగలం ?

ఇంట్లోకి పోయి దైనందిన కార్యక్రమం ప్రారంభించింది మనో...

# మ న స్సు

## శ్రీ మే కా సు ధా క ర రా వు

సాగర గర్భాంతరాంత రాళకు దూసుకు పోగలవీ
అంతరిక్షాన్ని చీల్చుకు పోగలవీ
నా లోచనాలు కనలేనివింకా ఎన్నెన్నో
చూడగలిగే సులోచనాలున్నాయి, నా మనస్సుకు !

నా చెవులు వినలేని
ఏ విశ్వగోళాంతర రేఖల విరిసిన
శబ్దాలనైనా వినగలిగే చెవులున్నాయి !
తేళ్లలా, సెలయేళ్లలా
పరుగులెత్తే కాళ్లున్నాయి !
జట్ విమానాన్ని మించి పోగల
రెక్కలున్నాయి !

స్వేచ్ఛ దాని ఊపిరి —
అందుకే
ఏ పంజరంలోనూ
బందీకృత కావడం సహించలేదు.

నా మనస్సు వెన్నెల
మల్లెల వనం
చల్లనిది — తెల్లనిది.
దానికో మంచి మనస్సుకూడాఉంది !

ఎవరు ఏ బాధానిదాఘాల ఊసరిలి మూల్గినా
ఊరి పారలే కన్నీటి చెలమలున్నాయి
నా మనస్సులో.
ఇంకా
గాలిలో ఈదాలనీ
సముద్రంలో ఎగరాలనీ...
ఏవేవో రంగు రంగుల ఊహల మేఘాలు —
బాధలూ భయాలూ, కష్టాలూ నష్టాలూ
ఎవ్వరికీ మిగలకూడదనీ;
సుఖజీవనం అందరిసొత్తూ కావాలనీ ...
అంతులేని ఆశయాల రాశులు !
ఎన్నెన్నో ఆశల మోసులు !
భాషకందని భావాల ప్రవాహాలు !
అది సుషుప్తిలో
కవితల స్వప్నాలు కంటుంది
శూన్యంలో సృష్టి సౌందర్యాన్ని చూస్తుంది !
మంచి దాని మతం
మానవత్వం దాని నైజం
ప్రేమ దాని ప్రాణం
కాంతి దాని అన్వేషణ
శాంతి దాని ఆవాసం.